


# స్వామిద్రోహి

జోడు గుర్రాల బండిలో పట్టుచీరల మూటలు వేసుకుని కాంచీపురం నుండి విజయనగరం బయలుదేరాడు రామస్వామి. వ్యాపారంలో సహాయకుడిగా వుండడానికీ, విజయనగరం వీధులలో చీరల మూటలు మోయడానికి తంగవేలు అనే అతడిని నెలజీతం మీద మాట్లాడుకుని వెంట తీసుకువెళ్ళాడు.

రామస్వామి పాతికేళ్ళ యువకుడు. తంగవేలుకు ఏభై ఏళ్ళు వుంటాయి. అయినా మనిషి దృఢంగానే వున్నాడు.

విజయనగరంలో ఒక అంగడి అద్దెకు తీసుకుని వ్యాపారం మొదలు పెట్టారు. కొద్ది రోజుల్లోనే రామస్వామికి జబ్బు చేసింది. మనిషి నీరసించి పోయి మంచానికి అతుక్కుపోయాడు. రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకుని వైద్యం చేయించుకుంటే తిరిగి మామూలుగా ఆరోగ్యవంతుడు అవుతాడని వైద్యుడు చెప్పాడు. రామస్వామి సరేనని వైద్యం చేయించుకుంటూ వుండిపోయాడు. ఊరికే కూర్చుని తింటూ వుంటే వ్యాపారంలో నష్టం వస్తుందని గ్రహించి పెత్తనం తంగవేలుకి ఇచ్చి వ్యాపారం చేయించాడు.

తంగవేలు ఒక కూలీని మూట మోయడానికి ఏర్పాటు చేసుకుని విజయనగర వీధులలో తిరుగుతూ పట్టుచీరల వ్యాపారం చేశాడు. దసరా, దీపావళి పండుగలు రావడంతో పట్టుచీరలన్నీ అమ్ముడు పోయి మంచి లాభం వచ్చింది.

విజయనగర వాతావరణం తంగవేలుకి బాగా పడింది. ఆరోగ్యంతో కళకళలాడి పోతున్నాడు. ఇక ఎప్పటికీ ఇక్కడే వుండిపోతే బాగుండుననే ఆలోచన వచ్చింది. ఆ మాటే రామస్వామికి చెప్పాడు. కాని రామస్వామికి ఆ నీళ్ళు పడక అక్కడ నుండి వెళ్ళిపోవాలనే నిశ్చయానికి వచ్చాడు.


కాంచీపురం నుండి సరుకు తెస్తూ అక్కడే వుండిపోయి వ్యాపారం చేద్దామని తంగవేలూ, వద్దని రామస్వామీ పోట్లాడుకున్నారు. జనాన్ని నమ్మించి రామస్వామిని మోసంచేసి ఎలాగయినా అతడి నుండి వ్యాపార సరుకులు లాక్కోవాలని ఒక పన్నాగం పన్నాడు తంగవేలు. ఆ ప్రకారం అవసరం లేకపోయినా అందరికీ వినబడేలా గట్టిగా కేకలు వేయసాగాడు.

అతడి కేకలు విని జనం చేరారు.

అప్పుడు తంగవేలు గట్టిగా అరుస్తూ "అయ్యా! వినండి. ఇంత అన్యాయం ప్రపంచంలో ఎక్కడైనా జరుగుతుందా?" అన్నాడు.

"ఏం జరిగింది? ఎందుకు మీరు పోట్లాడు కుంటున్నారు?" అని అక్కడ జేరినవాళ్ళు ప్రశ్నించారు.

"ఏం చెప్పమంటారయ్యా! మాది కాంచీపురం. పట్టుచీరల వ్యాపారం చేస్తూ ఇక్కడికి వచ్చాం. వ్యాపారం వృద్ధిలోకి వస్తున్నది. ఇక్కడే వుండి పోదాం అని నేను అంటున్నాను. వీడు నా కొడుకు రామస్వామి. కుర్రకుంక. వ్యాపారదక్షత తెలీదు. వచ్చిన లాభం చాల్లే అంటూ మన ఊరు వెళ్ళి




పోదామని గొడవ చేస్తున్నాడు. అయ్యా! మీరు చెప్పండి? వ్యాపారస్తుడికి ఒక ఊరేమిటి? ఎక్కడ లాభిస్తే అదే తన ఊరు అనుకోవాలి" అన్నాడు తంగవేలు.

జనానికి తంగవేలు మాటల మీద గురి కుదిరింది.

"అవునబ్బాయ్! మీ నాన్న చెప్పినట్లు విను" అన్నారు కొందరు పెద్దలు.

రామస్వామి నెత్తీ నోరు కొట్టుకున్నాడు. "ఇదెక్కడి గొడవండి బాబూ! తంగవేలు నా తండ్రి కాదు. నాకు అమ్మా, నాన్నా ఎవరూ లేరు. అందుకే ఇంత చిన్న వయసులోనే ఊరూరూ తిరిగి వ్యాపారం చెయ్యాల్సి వచ్చింది. నాకు సహాయకుడిగా వుండడానికి కాంచీపురం నుండి తీసుకు వచ్చాను ఇతడు నా సేవకుడు" అంటూ రామస్వామి లబలబ కొట్టుకున్నాడు.



"చూశారా!.... చూశారా! వాడి మాట వినడం లేదని నన్ను.... సాక్షాత్తూ తండ్రిని పట్టుకుని సేవకుడు అంటున్నాడు. వ్యాపారం చేసి సంపాదించిన డబ్బంతా వాడి దగ్గరే వుంది. ఇప్పుడు నా గతి ఏమిటి?" అని కన్నీళ్ళు పెట్టు కున్నాడు.

రామస్వామి తంగవేలునీ, తంగవేలు రామస్వామిని పరస్పరం దూషించుకుంటూ వుండగా రాజభటులు వచ్చి ఇద్దర్నీ తీసికెళ్ళి రాజు గారి ముందు హాజరు పెట్టారు.

శ్రీకృష్ణదేవరాయలు సింహాసనంపై ఆశీనుడై వున్నాడు. ఇద్దరి వాదనలూ సావధానంగా విన్నాడు.

"మహామంత్రీ! తమరే తీర్పు చెప్పాలి" అని తిమ్మరుసుని ఆదేశించాడు.

"చిత్తం మహాప్రభూ! ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒకరోజు గడువు ఇయ్యండి" అన్నాడు మహామంత్రి తిమ్మరుసు. రాయలు అందుకు తన అంగీకారం తెలపడంతో సభ ముగిసింది. తిమ్మరుసు రామస్వామిని తంగవేలుని విడివిడిగా కలుసుకొని విషయం గ్రహించాడు.

మర్నాడు సభలో "ప్రభూ! ఈ కుర్రవాడు రామస్వామి చెప్పేదంతా అబద్ధం. తంగవేలు అతడి సేవకుడు ఎంత మాత్రమూ కాదు. కన్న తండ్రే. సాక్షాత్తూ కన్నతండ్రినే సేవకుడని అవమానించిన ఇతడు క్షమార్హుడుకాడు. ఇతడికి మరణదండనే సరైన శిక్ష" అన్నాడు తిమ్మరుసు.

తీర్పు విన్న తర్వాత తంగవేలు సంతోషానికి అంతు లేదు. 'మహాప్రభువులు చల్లగావుండాలి' అంటూ చేతులెత్తి నమస్కరించాడు. రామస్వామి దుఃఖానికి అంతులేదు. భటులు రామస్వామిని

బంధిఖానాలో పడేశారు. మర్నాడు ఉదయం ఉరిశిక్ష అమలు జరపమని ఉత్తర్వు అయింది.

"తంగవేలూ! ఎంతైనా వాడు నీ కన్న కొడుకు. రేపు ఉదయం వచ్చి ఉరిశిక్ష అమలు జరగబోయే ముందు కొడుకుని కలుసుకో అతడి ఆఖరి కోరిక ఏమిటో తెలుసుకుని నెరవేర్చు" అన్నాడు తిమ్మరుసు.

"అలాగే మహాప్రభూ" అని తంగవేలు ఉత్సాహంగా వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం రామస్వామికి ఉరిశిక్ష పడుతుందని అతడు వున్న బందిఖానాకి తంగవేలు పళ్ళు, మిఠాయిలు తీసుకెళ్ళాడు. కాని అక్కడ ఉరితీసే ఏర్పాట్లేమీ తంగవేలుకీ కనిపించ లేదు. పైగా తంగవేలుని రాజభటులు బంధించి సభలో హాజరు పెట్టారు.

'మహారాజా! తంగవేలు నిజంగా రామస్వామి సేవకుడే. కన్నతండ్రి అయివుంటే కొడుక్కి ఉరిశిక్ష పడితే సహించలేడు. తనకు వ్యాపారమూ వద్దు, ధనమూ వద్దు కొడుకే కావాలని మొరబెట్టు కుంటాడు. తంగవేలు సేవకుడు కాబట్టే తన యజమాని సరుకులు హస్తగతం చేసుకోవాలని పన్నాగం పన్నాడు. యజమానికి ఉరిశిక్ష పడి నందుకు సంతోషించాడు. వ్యాపారం ధనం అన్నీ దక్కుతాయని దురాశపడ్డాడు. ఈ స్వామిద్రోహికి యావజ్జీవ కఠిన కారాగారశిక్ష విధించండి'అన్నాడు తిమ్మరుసు. శ్రీకృష్ణదేవరాయలు మందలించగా అది నిజమేనని తంగవేలు ఒప్పుకున్నాడు.

సభికులంతా మహామంత్రి సూక్ష్మబుద్ధికి హర్షధ్వానాలు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు తంగవేలుని చెరసాలలో వేయించాడు.

రామస్వామికి విముక్తి కలిగింది. అతడు వ్యాపారంలో వచ్చిన ధనంతో కాంచీపురం వెళ్ళిపోయాడు.

